ప్రజాశక్తి
సోమవారం 13 ఫిబ్రవరి 2023
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి







బాబోయ్.. సైబర్ నేరగాళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : **సైబర్ నేరగాళ్లు విశాఖ నగరంలో రోజుకొక కొత్త పంథా ఎంచుకుని పోలీసులకు సవాలు విసురుతున్నారు. సోషల్ మీడియా వేదికైన వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగ్రామ్‌లలో ప్రకటనలు, మెసేజ్‌ల రూపంలో ప్రజలకు వల విసురుతూ టాస్కులు ఇచ్చి డబ్బులు కొల్లగొడుతున్నారు. మోసపోతున్న వారిలో ఎక్కువుగా చదువుకున్నవారే ఉండడం గమనార్హం.**

సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల విపరీతంగా క్రైమ్ రేట్ పెరిగింది. బాధితుల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, చదువుకుంటున్న విద్యార్థులే ఎక్కువగా ఉన్నారు. క్రమేపీ సైబర్ నేరాలు పెరుగుతుండటంతో ప్రజల్లోనూ ఆందోళన మొదలైంది.

బాధితులు వీరే..

జనవరిలో తగరపువలస ప్రాంతానికి చెందిన ఐబిఎంలో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, ఉక్కునగరానికి చెందిన మాజీ సైనిక ఉద్యోగి, కంచరపాలేనికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి, గాజువాకకు చెందిన ఫార్మా క్వాలిటీ కంట్రోల్ ఉద్యోగిని.. ఇలా మొత్తం 13 మంది సుమారు రూ.45 లక్షలను కోల్పోయి పోలీసులను ఆశ్రయించారు. తక్కువ మొత్తంలో కోల్పోయిన వారు, పోలీసులను ఆశ్రయించని వారు పదుల సంఖ్యలో ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయి. పోలీసులు ఎంత ప్రయత్నించినా ఈ సైబర్ నేరగాళ్లకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రధాన నగరాలతో పాటు పక్క దేశాలైన బంగ్లాదేశ్, నేపాల్ వంటి ప్రాంతాల నుంచే సైబర్ నేరగాళ్లు మిగతా 2లో..

'ఉక్కు' పరిరక్షణ దీక్షల్లో వికలాంగులు

▶ వార్త 2లో..



సదస్సుకు హాజరైన శాస్త్రవేత్తలు, ఇతర ప్రముఖులు

శాస్త్ర, సాంకేతిక రంగాలతో దేశాభివృద్ధి

జన విజ్ఞాన వేదిక జాతీయ సదస్సులో వక్తలు

వార్త మెయిన్‌లో..

స్టీల్‌ప్లాంట్ ప్రమాద బాధితుల్లో ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్ - 2 విభాగంలో శనివారం మధ్యాహ్నం జరిగిన పేలుడులో గాయపడ్డ వారిలో ఇద్దరి పరిస్థితి ఆదివారానికీ విషమంగానే ఉందని సెవెన్ హిల్స్ ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. పేలుడులో గాయపడ్డ డిజిఎం అనిల్ పహివాల, సీనియర్ మేనేజర్ జయ కుమార్, మేనేజర్ చిన్నారావు, టెక్నీషియన్ ఈశ్వర్ నాయక్, ఛార్జ్‌మ్యాన్ పాండా సాహూ, కాంట్రాక్టు కార్మికులు బంగారయ్య, సూరిబాబు, అప్పలరాజు, శ్రీను, పోతయ్యలకు ఈ ఆసుపత్రిలోనే ఇక్కడే చికిత్స అందించారు. వీరిలో అప్పలరాజును డిశ్చార్జ్ చేశారు. శ్రీను, సూరిబాబుల ఆరోగ్యం ఇప్పటికీ విషమంగానే ఉంది. మిగిలిన ఏడుగురి ఆరోగ్యం నిలకడగా ఉంది. క్షతగాత్రులను ఆదివారం బిజెపి ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ పరామర్శించారు.

విశాఖ నగరాభివృద్ధిలో పరిశ్రమలదే కీలకపాత్ర

- కొత్తవి ఏర్పాటుకు స్థల సమస్య
- సేవా రంగం విస్తరణకు అపార అవకాశాలు
- 'ప్రజాశక్తి'తో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ గణపతి





ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'విశాఖ నగరం అభివృద్ధిలో అత్యంత కీలకమైన స్థానం పరిశ్రమలదే. ఇక్కడ పోర్టు ట్రస్ట్, వైజాగ్ స్టీల్‌ప్లాంట్, డిసిఐ, హెచ్‌పిసిఎల్, షిప్‌యార్డు వంటి ముఖ్యమైన భారీ ప్రభుత్వ రంగ సంస్థలు సహా ఇతర ప్రైవేట్ రంగ పరిశ్రమలూ విశాఖ ప్రగతిని ముందుకు తీసుకెళ్లాయని చెప్పొచ్చు. అయితే రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన జరిగిన తర్వాత విశాఖపట్నం జిల్లా పరిధి తగ్గిపోయింది. అర్బన్ జిల్లాగా విశాఖ అవతరించింది. ఆర్థిక ప్రగతిలో, నగరాభివృద్ధిలో ముఖ్యభూమిక పరిశ్రమలదే. 15 ప్రభుత్వ రంగ సంస్థలు, 52 ప్రైవేట్ రంగ పరిశ్రమలు, 12,500 చిన్న తరహా యూనిట్ (ఎంఎస్ఎంఇ)లు ఇక్కడ ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి' - అని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సిహెచ్.గణపతి వెల్లడించారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలను తెలియజేశారు. పారిశ్రామిక రంగం అభివృద్ధి, భవిష్యత్‌లో ఎలా ఉండబోతుందన్న అంశాలను ప్రస్తావించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

కొత్త పరిశ్రమల స్థాపన, ఉపాధి ఎలా ఉండబోతుంది ?

విశాఖపట్నం ప్రస్తుతం చిన్న జిల్లా అయినప్పటికీ ఉద్యోగ అవకాశాల పరంగానూ, ఆర్థిక అభివృద్ధి పరంగానూ ఇప్పటివరకూ బాగుంది. గడచిన కొన్నాళ్లుగా జిల్లాలో నూతన పరిశ్రమల మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

బాబోయ్.. సైబర్ నేరగాళ్లు

తమ దాడిని కొనసాగిస్తున్నారు.

నేరాలు జరిగే తీరిదీ..

మొదటిగా సైబర్ నేరగాళ్లు పంపే మెసేజెస్‌నుగానీ, యాడ్స్‌నుగానీ చూసి ఎవరైతే రెస్పాండ్ అవుతారో వారికి కమిషన్ ఆశ చూపిస్తారు. కమిషన్ బేస్డ్ టాస్క్ గేమ్స్ కింద వారిని రిక్రూట్ చేసుకునే విధంగా ఫేక్ వెబ్‌సైట్ డిజైన్ చేయబడుతుంది. బాధితున్ని మొదటిగా యూట్యూబ్‌లో వీడియోస్ లైక్, షేర్, సబ్‌స్క్రైబ్ చేయాలని కోరుతారు. అలా చేసినందుకుగాను ప్రతి లైక్‌కు కొంత మొత్తం (ఉదాహరణకు.. 100 లైక్స్‌కు రూ.130) చొప్పున అకౌంట్‌లో జమ చేస్తారు. మొదటి రోజు బాధితునికి సుమారుగా 4 వీడియోస్ అప్పగిస్తారు. లైక్ చేసినందుకుగాను కొంత నగదును అకౌంట్‌లో వేస్తారు. తదుపరి టాస్క్ కోసం అని చెప్పి వేరొక సోషల్ మీడియా టెలిగ్రాం యాప్‌కి రిడైరెక్ట్ చేసి సహాయం కోసం ఒక ట్యూటర్‌ని ఇస్తున్నట్లు చెప్తారు. మొదట టాస్క్‌ను కొంత డబ్బు చెల్లించి కొనాలని, అందుకుగాను 30 శాతం కమిషన్‌తో కలిపి వస్తుందని చెబుతారు. బాధితులు ఇదంతా నిజం అనుకుని తదుపరి టాస్క్ కొని వారు చూపించిన వెల్ఫేర్ టాస్క్ బటన్ నొక్కుతారు. కమిషన్‌తో కలిపి కొంత మొత్తాన్ని ఇస్తున్నట్లు చూపించి విత్‌డ్రా చేసుకోవడానికి వీలు లేకుండా చేస్తారు. డబ్బులు విత్‌డ్రా చేయాలంటే మరికొన్ని టాస్కులను కచ్చితంగా పూర్తి చేయాలని సైబర్ నేరగాళ్లు చెబుతారు. ఇలా బాధితుల నుంచి వివిధ కారణాలు చెబుతూ కొన్ని లక్షల రూపాయలను వివిధ టాస్క్‌ల కింద కొల్లగొడతారు. సైబర్ నేరాల్లో బాధితులంతా చదువుకున్నవారు అయినప్పటికీ లక్షల్లో నష్టపోయాకగానీ తాము మోసపోయామని గ్రహించడం లేదు

పోలీసులు ఏం చెబుతున్నారు ?

సైబర్ నేరాల నివారణకు తాము అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నప్పటికీ నేరగాళ్లు రోజుకొక కొత్త పంథాను ఎంచుకుంటూ నేరాలకు పాల్పడుతున్నారని పోలీసులు చెబుతున్నారు. ఆ నేరాలను నివారించడానికి తాము అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నామని, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని, ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యవంతం చేయడానికి పలు కార్యక్రమాలు చేపడుతున్నామని అంటున్నారు. అయినప్పటికీ కొంతమంది నిరుద్యోగులు తమ అవసరాలకు లోబడి డబ్బు వస్తుందన్న ఆశతో ఇటువంటి నేరగాళ్ల చేతిలో చిక్కి మోసపోతున్నారని అధికారులు తెలిపారు. అంతే కాకుండా ఎవరైనా వాట్సప్ లేదా ఏదైనా సోషల్ మీడియా నెట్‌వర్క్ ద్వారా వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని పేర్కొంటున్నారు. అలా క్లిక్ చేయడం ద్వారా తమ వ్యక్తిగత సమాచారంతోపాటు, ఫొటోలు, బ్యాంక్ అకౌంట్ వివరాలు, పాస్‌వర్డ్ వంటి సమాచారం సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కుతుందని హెచ్చరిస్తున్నారు. వీటితో వారు సులువుగా నగదును కొల్లగొడుతున్నారని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలంతా ఇటువంటి అనధికారిక లింకులను, మెసేజ్‌లను నమ్మవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఏదైనా జాబ్‌గానీ, మరే ఇతర సమాచారంగానీ తెలిస్తే ప్రత్యక్షంగా తెలుసుకోవాలని సూచిస్తున్నారు. నిజ నిర్ధారణ చేసుకున్న తరువాతే ముందుకు వెళ్లాలని, అశ్రద్ధ వహిస్తే తీవ్రమైన ఆర్థిక నష్టంతో పాటు మానసిక వేదన కూడా మిగులుతుందని అంటున్నారు.

విశాఖ నగరాభివృద్ధిలో పరిశ్రమలదే కీలకపాత్ర

ఏర్పాటు బాగా మందగించింది. దానికి కారణం నగర పరిధిలో భూములు అందుబాటులో లేకపోవడం. నగరం బయట ఉన్న మండలాలైన పద్మనాభం, ఆనందపురం, భీమునిపట్నం తదితర చోట్ల భూముల ధరలు బాగా ఎక్కువగా ఉన్నందున పెట్టుబడిదారులు ఇక్కడకు వచ్చేందుకు వెనుకంజ వేస్తున్నారు. దీంతో పరిశ్రమల స్థాపన కొంత సమస్యగానే ఉంది.

జిల్లాలో ఉన్న పరిశ్రమల్లో కార్మికుల సంఖ్య, పెట్టుబడులు ఎలా ఉన్నాయి.. ?

విశాఖ జిల్లాలోగల ఎంఎస్‌ఎంఇలు 12,500 యూనిట్లలో 1.40 లక్షల మంది, ప్రభుత్వ రంగ పరిశ్రమలలో 48 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. భారీ పరిశ్రమల్లో పెట్టుబడులు రూ.32,800 కోట్లుకాగా చిన్నతరహా పరిశ్రమల్లో పెట్టుబడులు రూ.8100 కోట్లు ఉన్నాయి. జిల్లాలో ప్రభుత్వ రంగ పరిశ్రమల వల్లే మిగతా చిన్న పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమలను రక్షించుకుంటేనే విశాఖ నగర అభివృద్ధి నిరంతరాయంగా ఉంటుంది.


విశాఖలో ఇంకా ఏయే రంగాలకు అవకాశాలున్నాయి ?

విశాఖ జిల్లాలో 10 ఎంఎస్‌ఎంఇ ఇండస్ట్రియల్ పార్కులు ఉన్నాయి. వీటిని బాగా అభివృద్ధి చేసుకుంటే ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. సేవా రంగంలో పరిశ్రమలు ఏర్పాటు చేయదలచుకున్న వారికి అపారమైన అవకాశాలు విశాఖలో ఉన్నాయి. ఇంకా సేవా, మౌలిక సదుపాయాల రంగం విస్తరణకు ఆస్కారం ఎక్కువ. ఈ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం (పిఎంఇజిపి) కింద రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు బ్యాంకు రుణాలు పొందే అవకాశం ఉంది. ఈ రంగంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం విశాఖ జిల్లా వరకూ 46 పరిశ్రమలు కాగా 100 వరకూ ఈ టార్గెట్‌ను పెంచాలని ప్రయత్నాలు చేస్తున్నాం. ఈ సర్వీస్ సెక్టార్ పరిశ్రమల ఏర్పాటుకు 18 సంవత్సరాల వయస్సు కలిగిన, ఎనిమిదో తరగతి ఆపై చదువుకున్న వారు ఆదాయంతో సంబంధం లేకుండా బ్యాంకు రుణాలు పొందవచ్చు. ఈ పథకాన్ని నిరుద్యోగ యువతకు, ప్రజలకు దగ్గర చేయాలనే ఉద్దేశంతో ఈ మధ్యకాలంలో డిఆర్‌డిఎ సంస్థతో కలిసి పిఎంఇజిపి అవగాహన సదస్సులను విశాఖ జిల్లాలో నిర్వహించాం. మంచి స్పందన లభించింది.

విశాఖ వేదికగా జరుగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సులో పరిశ్రమల కేంద్రం పాత్ర ఏమిటి ?

మార్చి 3, 4 తేదీల్లో విశాఖ నగరంలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం దాదాపు ఏర్పాట్లు పూర్తిచేసింది. వీటి నిర్వహణ బాధ్యతను విజయవాడలోని ఇన్వెస్ట్‌మెంట్ అండ్ కామర్స్ డిపార్ట్‌మెంట్ చూస్తుంది. జిల్లా పరిశ్రమల కేంద్రం, ఇంకా కొన్ని ప్రభుత్వ శాఖల వారితో కో-ఆర్డినేషన్ చేసుకుంటున్నాం. సుమారు 49 దేశాల నుంచి ప్రతినిధులు వస్తున్నారని తెలిసింది. ఇలా 500 మందికిపైగా వ్యాపారవేత్తలు రానున్నారు. ఈ నెల 13 నుంచి మరింత ముమ్మరంగా ఈ పనులు జరగబోతున్నాయి. ఈ సదస్సులకు టైమ్స్ ఆఫ్ ఇండియా, సిఐఐ, ఇతర వాణిజ్య సంస్థలు సహాయ సహకారాలు అందజేస్తున్నాయి. జి-20 దేశాల శిఖరాగ్ర సదస్సులు అదే నెల 28, 29 తేదీల్లో బీచ్ రోడ్డులోని రాడిసన్ బ్లూలో జరుగనున్నాయి.

'ఉక్కు' పరిరక్షణ దీక్షల్లో వికలాంగులు



దీక్షా శిబిరంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ, వికలాంగులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' అని, ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించాలని చూస్తే సహించేది లేదని వికలాంగులు నినదించారు. అమ్మేవాడిని, కొనేవాడిని ప్లాంట్ దరిదాపుల్లోకి రానిచ్చేది లేదని హెచ్చరించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు ఆదివారానికి 682వ రోజుకు చేరాయి. దీక్షల్లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) కార్యకర్తలు కూర్చున్నారు. దీక్షా శిబిరానికి ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం వల్ల రిజర్వేషన్లకు విఘాతం ఏర్పడుతుందన్నారు. వికలాంగులు, ఎస్‌సి, ఎస్‌టిలు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో స్టీల్‌ప్లాంట్ ఎంతో కీలకపాత్ర పోషించిందన్నారు. అటువంటి కర్మాగారానికి సొంత గనులు కేటాయించాల్సింది పోయి ప్రైవేటుపరం చేసేందుకు కుట్రలు పన్నడం దారుణమన్నారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర అధ్యక్షులు కోడూరు అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రైవేట్ సంస్థలు వికలాంగులను అస్సలు పట్టించుకోవన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పరవాడ ఫార్మా సిటీ, అచ్యుతాపురం సెజ్, దువ్వాడ విసెజ్‌ల్లో ఒక్క వికలాంగ ఉద్యోగి లేరన్నారు. ప్రభుత్వరంగ సంస్థలే వికలాంగులకు ఆదరువుగా ఉన్నాయని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగేంత వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దీక్షల్లో ఎన్‌పిఆర్‌డి జిల్లా అధ్యక్షులు పాల వెంకయ్య, నాయకులు బడే అప్పలరాజు, సత్తిబాబు, బి.శ్రీనివాస్, మల్లేశ్వరరావు, పి.అప్పలరాజు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విధానం రద్దుకు ధర్నా



ధర్నా చేస్తున్న పలు సంఘాల నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విద్యారంగాన్ని కాషాయీకరణ, కార్పొరేటీకరణ, కేంద్రీకరణ చేసే ప్రజా వ్యతిరేకమైన నూతన జాతీయ విద్యా విధానం - 2020ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యా హక్కు వేదిక ఇచ్చిన పిలుపు మేరకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆదివారం ధర్నా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ విశాఖ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానంతో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ తరగతుల పిల్లలు పూర్తిగా విద్యకు దూరమయ్యే ప్రమాదముందన్నారు. ఆ విద్యా విధానాన్ని మన రాష్ట్రంలో అమలు చేయడం సిగ్గుచేటని తెలిపారు. ఇప్పటికే జిఒ నెంబర్ 84, 85, 117 తీసుకొచ్చి పాఠశాలలను మెర్జ్ చేసి రాష్ట్ర వ్యాప్తంగా 2600 పైచిలుకు పాఠశాలలను మూసివేశారన్నారు. బైజూస్ ఒప్పందాన్ని రద్దు చేసి ఉపాధ్యాయులతోనే పాఠ్యాంశాలు బోధించాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 50,600 టీచర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యా పరిరక్షణ కమిటీ జిల్లా కన్వీనర్ ధర్మేందర్ రెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో జాతీయ నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తూ పాఠశాలలను ముక్కలు చేస్తోందని విమర్శించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వీరభద్రరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 50 వేలకుపైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ మూడున్నర సంవత్సరాల కాలంలో ఒక టీచర్ పోస్ట్ కూడా భర్తీ కాలేదన్నారు. డిటిఎఫ్ జిల్లా నాయకులు బుజ్జి మేడం, ఎల్.సత్యనారాయణ, నానాజీరావు, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ధనుంజయ్, కిషోర్, రిటైర్డ్ ప్రొఫెసర్ సూరప్పుడు, మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు శరత్, న్యాయవాది చలం, కెవిఎస్.రాజు పాల్గొన్నారు.

ఎంజిసిహెచ్‌లో బాల్య కేన్సర్ దినోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ (ఎంజిసిహెచ్)లో ఆదివారం అంతర్జాతీయ బాల్య కేన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు. బాల్య కేన్సర్‌పై అవగాహన, పిల్లల సంరక్షణ, వారి కుటుంబ సభ్యులకు సహకారం వంటి అంశాలపై ప్రచార నిమిత్తం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ బాల్య దశలో వచ్చే కేన్సర్ కేవలం పిల్లలను, వారి కుటుంబాలను మాత్రమే కాకుండా సమాజాన్ని ప్రభావితం చేస్తుందని తెలిపారు. తమ ఆసుపత్రి ఆధ్వర్యాన బాల్య కేన్సర్‌పై అవగాహన నిమిత్తం 'బ్రేవ్ హార్ట్' ప్రోగ్రాం తలపెట్టామన్నారు. ఈ భయంకరమైన వ్యాధిని అత్యంత విశ్వాసంతో జయించిన వారికి అభినందనలు తెలిపారు.

మన్యంలో కొనసాగుతున్న చలి తీవ్రత

పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరుతోపాటు ఏజెన్సీలో పొగ మంచు తీవ్రత తగ్గడం లేదు. ఆదివారంపాడేరుతో పాటు పరిసరాల ప్రాంతాల్లో పొగ మంచు దట్టంగానే కురిసింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 10 వరకు పొగ మంచు దట్టంగా కమ్మేసింది. వాహన చోదకులు లైట్లు వేసుకొని రాకపోకలు సాగించారు. చలి ప్రభావం తీవ్రంగా ఉంటుండడంతో జనం వణుకుతున్నారు.

కొత్త డిజైన్‌లో రక్షణ గోడ



సిమెంట్ రోడ్డుకు మూడు మీటర్ల దూరంలో కడుతున్న రక్షణ గోడ

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు సత్యనారాయణపేట కొండవాలు ప్రాంతంలో కొత్త డిజైన్‌లో ఎట్టకేలకు రక్షణ గోడ నిర్మాణం చేపట్టారు. దీని నిర్మాణంపై పలువురిలో పలు సందేహాలు కలుగుతున్నాయి. నివాసాల వద్ద ఉన్న సిమెంట్ రోడ్డుకు అనుకుని గోడ నిర్మించాల్సి ఉండగా, సుమారు మూడు మీటర్ల దూరంలో దీని నిర్మాణం చేపట్టడంపై సర్వత్రా అనుమానాలు, సందేహాలు, భయాందోళన వ్యక్తమవుతున్నాయి. పక్కనే ఇప్పటికే నిర్మించి ఉన్న రక్షణ గోడ నివాసాల వద్ద ఉన్న సిమెంట్ రోడ్డుకు అనుకుని ఉండగా, అందుకు భిన్నంగా ఇప్పుడు మూడు మీటర్ల దూరంలో నిర్మాణం చేపట్టడంపై బి. న్నా న బి. (ప్రా య ా ల ం వ్యక్తమవుతున్నాయి.

జివిఎంసి నిధులు రూ.74 లక్షలతో రక్షణ గోడ నిర్మాణ పనులు చేపట్టారు. అల్ప పీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు గతేడాది సెప్టెంబర్‌లో ఇక్కడ గతంలో నిర్మించిన రక్షణ గోడ కూలిన విషయం విధితమే. స్థానికుల విజ్ఞప్తి, వినతులు మేరకు ఎట్టకేలకు స్పందించిన జివిఎంసి అధికారులు రక్షణ గోడ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఇంత వరకూ బాగానే ఉన్నా నిర్మాణంలో ఈ తరహా విధానం ఎందుకు ఎంచుకున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. నివాసాలు, సిమెంట్ రోడ్డుకు మూడు మీటర్ల దూరంలో

నిర్మాణంపై సందేహాలు

గోడ నిర్మాణం వల్ల ప్రయోజనం ఏముంటుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. మరలా వర్షాలు కురిస్తే సమస్య మొదటికే వస్తుందేమోనన్న ఆందోళన తమలో నెలకొందని కొందరు చెబుతున్నారు.

అనుమానం అవసరం లేదు

రక్షణ గోడ నిర్మాణంలో అనుమానాలు, సందేహాలకు ఆస్కారం లేదు. ఎవరికీ భయాందోళన అవసరమే లేదు. ఆంధ్రా యూనివర్సిటీలో ఉన్న ఓ విభాగం ఇంజినీరింగ్ అధికారులు రూపొందించిన కొత్త తరహా డిజైన్ ప్రకారం పుటింగ్ పద్ధతిలో గోడ నిర్మాణం చేపట్టాం. 25 మీటర్ల పొడవున అత్యంత నాణ్యంగా రక్షణ గోడ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నివాసాల వద్ద ఉన్న సిమెంట్ రోడ్డుకు మూడు మీటర్ల మధ్యలో గ్రావెల్‌తో నింపుతాం.



ఎ.సుమన్
అసిస్టెంట్ ఇంజినీర్
జివిఎంసి జోన్-1

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



ప్రజాశక్తి -కంచరపాలెం: జ్ఞానాపురం బిఆర్‌టిఎస్ రోడ్డులో విషాదం చోటు చేసుకుంది. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో యువకుడు తీవ్ర గాయాలతో కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... మురళీనగర్ బర్మాకాలనీలో నివాసముంటున్న దినేష్ కుమార్ (27) సిపోర్టు వద్ద ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి డ్యూటీ ముగించుకొని సుజుకి యాక్సెస్ వాహనంపై సిపోర్ట్ నుంచి కాన్వెంట్ మీదుగా కంచరపాలెం వైపు ఇంటికి బయలుదేరాడు. ఈ తరుణంలో ఆరిలోవ ప్రాంతానికి చెందిన రామిరెడ్డి (27), పి.సాయిసాగర్ కలిసి సింహాచలం నుంచి కంచరపాలెం, కాన్వెంట్ జంక్షన్ మీదుగా ఆర్‌కె.బీచ్‌కు డ్యూక్ బైక్‌పై వేగంగా వెళుతున్నారు. జ్ఞానాపురం జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ ఎదురుగా బిఆర్‌టిఎస్ రోడ్డు వద్ద కంచరపాలెం వైపు వెళ్తున్న దినేష్‌కుమార్ వాహనాన్ని, డ్యూక్ బైక్‌తో రామిరెడ్డి ఢీ కొట్టాడు. రెండు వాహనాలూ కిందపడిపోయాయి. ఈ ఘటనలో దినేష్‌కుమార్, రామిరెడ్డి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. రామిరెడ్డి వెనుక కూర్చున్న సాయిసాగర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. పశ్చిమ ఎసిపి అన్నెపు నరసింహమూర్తి, కంచరపాలెం సిఐ విజయ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. దినేష్‌కుమార్, రామిరెడ్డి మృతదేహాలను కెజిహెచ్ మార్చురీకి తరలించారు. సాయిసాగర్‌ను చికిత్స నిమిత్తం కెజిహెచ్‌లో చేర్చారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు అంటున్నారు. హెల్మెట్లు ధరించి ఉంటే ఇద్దరూ ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉండేదని అభిప్రాయపడుతున్నారు. సిఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : పాత నగరం వెలమపేటలోని అక్బర్ రెసిడెన్సీ ఎదురుగా తోపుడు బండిపై గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు ఆదివారం గుర్తించారు. 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సున్న అతని గురించి ఆరాతీశారు. 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావును కూడా పోలీసులు వాకబు చేశారు. కార్పొరేటర్ వచ్చిన మృతదేహాన్ని చూసి తనకు కూడా తెలియదని చెప్పారు. మృతదేహం వద్ద ద్రవరూపంలో ఉన్న సీసా కనిపించడంతో అనుమానాస్పద మృతిగా భావించి పోలీసులు కేసు నమోదు చేశారు. సిమెంట్ రంగు షర్ట్, గ్రే కలర్ నిక్కరు ధరించి ఉన్నాడని, శరీరంపై ఎలాంటి గాయాలూ లేవని కేసును దర్యాప్తు చేస్తున్న వన్ టౌన్ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు.

శ్రీనివాస్‌కు సన్మానం

ప్రజాశక్తి -తగరపువలస : జాతీయ చేనేత ఐక్య వేదిక అధ్యక్షులుగా నియమితులైన తగరపువలస ప్రాంతానికి చెందిన శ్రీఎల్లమాంబ టైలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు గిడుతూరి శ్రీనివాస్‌ను స్థానిక టైలర్లు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి వి.సత్య, ఎల్లమాంబ టైలర్ల సంఘం ప్రధాన కార్యదర్శి పెంటపల్లి శ్రీనివాసరావు, సలహాదారులు పి.సత్యనారాయణ, నారాయణరావు, సభ్యులు గోవిందరావు, లక్ష్మణరావు, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జిత సేవకు స్పందన

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచల దేవస్థానంలో జరుగుతున్న ఆర్జిత సేవలకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఆదివారం జరిగిన స్వర్ణపుష్పార్చనలోనూ, నిత్య కల్యాణంలోనూ, స్వాతీ నక్షత్ర హోమంలోనూ అధిక సంఖ్యలో భక్తుల పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

మొరాయిస్తున్న ఆర్‌టిసి

- భక్తులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి-సింహాచలం : సింహగిరిపైకి భక్తులను చేర్చే సింహాచలం డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సులు గత కొద్ది రోజులుగా ఘాట్ రోడ్డులో మొరాయిస్తున్నాయి. దీంతో భక్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆర్‌టిసి అధికారులు స్పందించి కండిషన్‌లో ఉన్న బస్సులను సింహగిరి కొండపైకి పంపాలని పలువురు కోరుతున్నారు.



సింహగిరి కొండపై
మొరాయించిన ఆర్‌టిసి బస్సు

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు పట్ల దళితుల నిరసన

ప్రజాశక్తి -భీమునిపట్నం : డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను ఉద్దేశించి తెలంగాణ రాష్ట్ర ఆర్ఎస్ఎస్ కార్యకర్త అమరప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ పలువురు దళితులు ఆదివారం నిరసన తెలిపారు. స్థానిక ఎంసి యార్డు ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల ఆధ్వర్యాన చేపట్టిన నిరసననుద్దేశించి కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భాగం లక్ష్మి, దళిత సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర నాయకులు భాగం గోపాలరావు మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా నేటికీ దళితులపై దాడులు హత్యలు, అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆర్ఎస్ఎస్ కార్యకర్తపై ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల ప్రతినిధులు బి.ఈశ్వర్‌కుమార్, బి.నరసింగరావు, పి.నరసింగరావు, మాజీ సర్పంచ్ జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



భీమిలిలో అంబేద్కర్ విగ్రహం వద్ద దళితుల నిరసన

సిసి రోడ్డుపై బోరు ఏర్పాటు పట్ల ఫిర్యాదు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని బి.తాళ్లవలస గ్రామం కొండపల్లి వారి వీధిలో సిసి రోడ్డుపై బోరు వేశారని టిడిపి మండల అధ్యక్షులు కోరాడ రమణ ఆదివారం గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఇదే గ్రామానికి గతంలో సర్పంచ్‌గా చేసిన కొండపల్లి సన్యాసినాయుడు ప్రస్తుతం వైసిపి నాయకుడుగా ఉన్నాడు. అతని ఇంటి అవసరాలకు ప్రయివేటుగా వేయించుకుంటున్న బోరును సిసి రోడ్డుపై తీయించాడు. దీనిని పరిశీలించి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ పంచాయతీకి చెందిన సిసి రోడ్డుపై ప్రయివేటు బోరు వేయడం వల్ల గ్రామస్తులు కూడా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

మార్షల్ ఆర్ట్స్‌కు ప్రాధాన్యం : సుమన్




సుమన్‌ను సన్మానిస్తున్న కమిటీ ప్రతినిధులు

ప్రజాశక్తి-సీతమ్మధార : రాజధాని కానున్న విశాఖలో స్పోర్ట్స్ అండ్ మార్షల్ ఆర్ట్స్‌కు అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని సినీ నటుడు సుమన్ అన్నారు. స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ సిఎం కప్ కరాటే పోటీలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో సుమన్ మాట్లాడుతూ, ఈ కరాటే పోటీల్లో పాల్గొనేందుకు జర్మనీ, స్విట్జర్లాండ్, ఇండోనేషియా, బంగ్లాదేశ్ తదితర 9 దేశాల నుంచి కరాటే క్రీడాకారులు హాజరయ్యారన్నారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ, క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. కరాటే క్రీడ ఆత్మరక్షణకు ఆలంబనగా నిలుస్తున్నందున బాలబాలికలందరూ నేర్చుకోవాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ కరాటే పోటీలను విజయవంతంగా నిర్వహించిన కమిటీ సభ్యుల్ని అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో దాడి సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు, క్రీడాకారులు, వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -మధురవాడ : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన జనసేన కార్యకర్త వెంపాడ అచ్చిరెడ్డికి పార్టీ తరుపున ఆర్థిక సహాయాన్ని భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్ల ఆదివారం అందించారు. జనసేన క్రియాశీల సభ్యత్వం ఉన్న వారికి పార్టీ భరోసా కల్పించేలా పవన్ కల్యాణ్ సంతకంతో కూడిన రూ.42 వేల చెక్కును ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఆదివారం బాధితునికి అందజేశారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ, ప్రమాదవశాత్తు గాయపడిన వారిని జనసేన ఆదుకుంటుందన్నారు. రానున్న రోజుల్లో భీమిలిలో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు సంక్షేమం అందించేందుకు అధినేత సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, శాఖర శ్రీనుబాబు, నాగోతి నాయుడు, పోతిన అనురాధ, శంకర్ రెడ్డి, కొయ్య శ్రీనివాస్, గుడివాడ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



బాధితునికి చెక్కు అందిస్తున్న సందీప్ పంచకర్ల తదితరులు



నేవల్ ఏవియేషన్ గురించి వివరిస్తున్న నావికాదళ సిబ్బంది

ఐఎన్ఎస్ డేగాను సందర్శించిన విద్యార్థులు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : నేవల్ ఎయిర్‌స్టేషన్ ఐఎన్ఎస్ డేగాలో శనివారం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం విద్యా సందర్శన నిర్వహించారు. విశాఖపట్నంలోని విశ్వోదయ పాఠశాల నుంచి 35 మంది విద్యార్థులు, 8 మంది బోధనా సిబ్బంది ఐఎన్ఎస్ డేగాను సందర్శించారు. అక్కడ వారికి నేవల్ ఏవియేషన్, దాని కీలకమైన స్థూలదృష్టి గురించి వివరించారు. జాతీయ సముద్ర ప్రయోజనాలను కాపాడే ఐఎన్ఎస్ డేగాలో ఉన్న వివిధ నౌకాదళ విమానాల గురించి విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎయిర్ ట్రాఫిక్ సర్వీసెస్ గైడెడ్ టూర్, ఎయిర్ సేఫ్టీ పరికరాల ప్రదర్శన, కార్డియో పల్మనరీ రెససిటేషన్ ప్రదర్శన కూడా ఉన్నాయి. ఈ పర్యటన విద్యార్థులకు నావికాదళ సోదరభావంతో పరస్పర చర్చకు వేదికను అందించిందని, భారత నౌకాదళంలో చేరడానికి వారిని ప్రేరేపించిందని అధికారులు తెలిపారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం

ప్రజాశక్తి-సీతమ్మధార : శృతిలయ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యాన సీతమ్మధార టిపిటి కాలనీలోని ద్రవిడ సంక్షేమ సంఘం లలిత నూకల కామేశ్వరి కల్యాణ మండపంలో శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. రంగనాథాచార్యులు, సుబ్రహ్మణ్యాచార్యులు నిర్వహణలో జరిగిన కల్యాణంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. తొలుత ప్రముఖ సంగీత దర్శకుడు ఉదయ్‌కుమార్ సారథ్యంలో ప్రారంభమైన అన్నమయ్య సంకీర్తన ప్రత్యేకంగా నిలిచింది. కొణతాల వెంకట సురేష్ పాడిన మేలుకో సింగరాయ, యు.ప్రభాకర్ పాడిన అంతయు నీవే, మెలోడీ సత్యనారాయణ పాడిన ఏ పురాణంలో ఇతికినా, సత్యశ్రీ పాడిన కట్టెదురా వైకుంఠం, కడలి వీరా స్వామి పాడిన అదివో అల్లదివో గీతాలు అలరించాయి. వీరితో పాటు భూమిక, ధరణి, సంతోషి, నాగలక్ష్మి, లయ, ఎన్ రాజేశ్వరి, కృష్ణంరాజు, మేఘన హరి సంకీర్తనలను పాడారు. శ్రీనివాసుని కల్యాణంలో మధుర ఘట్టాలను ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవి.రాజశేఖర్ తన వ్యాఖ్యానంతో ఆవిష్కరించారు. ఇందులో భాగంగా హెచ్‌బి.కాలనీ వద్ద గల శ్రీ త్రిమూర్తిక వెంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి స్వామి తిరువీధి మహోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు శేష వస్త్రాలు, ప్రసాదాలు, స్వామి చిత్ర పటాలు అందజేశారు. శృతిలయ ప్రభాకర్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో సెంచూరియన్ విశ్వ విద్యాలయ ఉప కులపతి డాక్టర్ జిఎస్ఎన్.రాజు, రైటర్స్ అకాడమి అధ్యక్షులు వివి.రమణమూర్తి, మాజీ ఎడిసిపి మహ్మద్‌ఖాన్, ద్రవిడ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎన్ఎఎన్.మూర్తి, కార్యదర్శి ఎస్.ఫణిస్వామి, కమిటీ సభ్యులు కొణతాల రాజు, సిహెచ్.వి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మోడీ సాయంతోనే అదానీ దోపిడీ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : మోడీ సాయంతోనే అదాని ప్రపంచ కుబేరుడిగా మారాడని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర మహిళ సమన్వయకర్త డాక్టర్ సీతల్ మదన్ ఆరోపించారు. ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆమ్‌ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో 'సిగ్గుపడండి మోడీ- అదానీ కోసం పనిచేయడం ఆపండి' అంటూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేశంలో అతిపెద్ద కుంభకోణానికి ఆదానీ పాల్పడ్డారని ఆరోపించారు దేశంలోని పలు ప్రభుత్వ రంగ పరి శ్రమలు, ఓడరేవులు, విమానాశ్రయాలను అదానీకి కట్టబెట్టారన్నారు. ఇప్పటికైనా, కార్పొరేట్ సంస్థల లబ్దికోసం కాకుండా, సామాన్య ప్రజల అభ్యున్నతికి మోడీ ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. మత్తు వదిలి, జాయింట్ పార్లమెంట్ కమిటీ ఏర్పాటుచేసి అదానీ కుంభకోణంపై చర్చించి తగు చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ నాగూర్, నూతి ఉదయ భాస్కర్, సిరా రమేష్, కొణతాల హరినాథ్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు

కేంద్ర ప్రభుత్వ విధానాలతో పెన్షనర్లకు కష్టాలు

ప్రజాశక్తి-మాధవధార, కరాస, కంచరపాలెం : కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల పింఛన్‌దారులు రోడ్డున పడుతున్నారని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (ఎపిఅర్‌పిఎ) గౌరవాధ్యక్షులు బిటి.మూర్తి ఆవేదన వ్యక్తంచేశారు. ఆప్రా ఆధ్వర్యాన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అతి తక్కువ పింఛన్‌తో కుటుంబాలను పోషించుకోలేక పింఛన్‌దారులు రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పెరుగుతున్న ధరలతో జీవనం దుర్భరంగా మారుతోందన్నారు. పింఛన్ పెంచడంతోపాటు, వైద్య సదుపాయాలు కల్పిస్తామని 2014 ఎన్నికలకు ముందు మోడీ భరోసా ఇచ్చి తొమ్మిదేళ్లు అయినా నేటికీ పాత పద్ధతినే అవలంభిస్తున్నారని విమర్శించారు. తక్షణమే పింఛను పెంపుదలతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

పింఛన్‌దారుల సమస్యలపై ఈ నెల 13వ తేదీన ఉదయం 10 గంటలకు మర్రిపాలెంలోని పిఎఫ్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాకు పింఛన్‌దారులందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి కె.నూకరాజు, కెపి.కుమార్, జి.సూర్యప్రకాష్, భాస్కరరావు, అప్పలరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బిటి మూర్తి

'చీకటి పువ్వు' ఆవిష్కరణ



చీకటి పువ్వు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మూర్తి, జిఎస్.రామ్మోహన్, పద్మ తదితరులు

ప్రజాశక్తి-సీతమ్మధార : మహిళా చేతన కార్యకర్త కత్తి పద్మ రచించిన కథల సంకలనం 'చీకటి పువ్వు'ను ప్రముఖ సాహితీ విమర్శకుడు వివిన మూర్తి ఆదివారం పౌర గ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాహితీ విమర్శకుడు జిఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ, నాలుగు దశాబ్దాలుగా ప్రజాజీవనంలో ఉన్న కత్తి పద్మ రాసిన కథల విస్తృతి విశాలమైనదన్నారు. మహిళల సమస్యలపై పనిచేస్తున్న పద్మ బాధితుల జీవితాలను దర్శించే పద్ధతి విలక్షణమైనది పేర్కొన్నారు. ఆ విలక్షణత, వైవిధ్యం కథలలో కనిపిస్తాయని తెలిపారు. ఆమె కథలు వాస్తవికతను ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. కథలు చదువుతుంటే పాఠకుల్లో ఆ పాత్రల పట్ల సహానుభూతి కలుగుతుందన్నారు. ప్రముఖ రచయిత్రి, న్యాయవాది జహారా మాట్లాడుతూ, సాహిత్యం బాధితుల బాధ, దుఃఖం ప్రతిబింబించకపోతే అది పాఠకులను హత్తుకోదని అభిప్రాయపడ్డారు. పాఠకుల హృదయాలను కదిలించే లక్షణం పద్మ రాసిన కథలకు ఉందన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు వి.సంధ్య మాట్లాడుతూ, పద్మ కథలలో పాత్రలు సజీవమైనవని పేర్కొన్నారు.

'చీకటి పువ్వు' కథల ఆడియోను కథా రచయిత బమ్మిడి జగదీశ్వరరావు ఆవిష్కరించారు. ఈ కథలు యూట్యూబ్ లో లభ్యమవుతాయి. కథల ఆడియో రూపకల్పన సందర్భంగా తమ అనుభవాలను సామాజిక కార్యకర్త వంగపల్లి పద్మ, సినీ విమర్శకులు లలిత వివరించారు.

చీకటి పువ్వు పుస్తక రచయిత కత్తి పద్మ మాట్లాడుతూ, తన కథలు ఉత్తరాంధ్ర మహిళల బాధలనూ, హృదయాన్ని ప్రతిబింబిస్తాయన్నారు. తన కథలలోని పాత్రలు విషాదాల వలయాల్లో చిక్కుకొని కూడా తమ జీవితాలను నిలబెట్టుకోవడానికీ, పరిష్కారాలను సాధించుకోవడానికి ప్రయత్నిస్తాయని చెప్పారు. చీకటి పువ్వు కథా సంకలనాన్ని మిత్ర సాహితి ప్రచురించింది. సభకు 'మిత్ర సాహితి' సభ్యుడు విశాఖ వర్మ అధ్యక్షత వహించారు.

కథా నిలయం వార్షికోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార : కథా నిలయం 26వ వార్షికోత్సవ సభ ఆదివారం పౌర గ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా బాల సాహిత్యం మీద ప్రముఖ రచయిత బమ్మిడి జగదీశ్వరరావు ప్రసంగించారు. ఒక పిల్లవాని భావి జీవితాన్ని ప్రభావితం చూపే బాల్యంలో చదువు పేరుతో బాలల కల్పనా శక్తులను నాశనం చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బాలలకు పౌష్టికాహారం ఎంత అవసరమో సాహిత్యం కూడా కనీస అవసరంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భావించాలని అభిప్రాయపడ్డారు. పిల్లల ఊహ ప్రపంచాన్ని చిదిమేసే పని చదువు పేరుతో జరగడం బాధాకరమన్నారు.



'చిగురంత ఆశ', 'రియలిస్టిక్ సినిమా'ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

'కథా సాహితి' సంపాదకుడు వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ, ఉత్తమ కథలను క్రమం తప్పకుండా 32 ఏళ్లుగా ఏటా ప్రచురిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ బాలల సినిమాలను పరిచయం చేస్తూ కథా రచయిత శివలక్ష్మి రచించిన 'చిగురంత ఆశ'నూ, ఉత్తమ అంతర్జాతీయ సినిమాలపై సమీక్షా సంపుటి 'రియలిస్టిక్ సినిమా'నూ రచయిత జయసూర్య ఆవిష్కరించారు. శ్రీకాకుళంలో ప్రముఖ రచయిత కాళీపట్నం రామారావు సారథ్యంలో స్థాపించిన కథా నిలయంలో నేటికీ 97 వేల కథలు లభ్యం అవుతున్నాయని కథా నిలయం కార్యదర్శి దాసరి రామచంద్రరావు చెప్పారు. కథానిలయం వార్షికోత్సవ సభలు ఇకపై తెలుగు రాష్ట్రాలలోని వేర్వేరు నగరాలు, పట్టణాల్లో నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. కథా నిలయం కోశాధికారి కాళీపట్నం సుబ్బారావు వందన సమర్పణ చేశారు.

ఘనంగా రజకుల బల్లల పండగ

ప్రజాశక్తి-కరాస : జివిఎంసి 52వ వార్డు పరిధి మర్రిపాలెం ఉడా లే-అవుట్ రజక వీధిలో బల్లల పండుగను ఘనంగా నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ హాజరై తొలుత పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పూర్వం నుంచి వస్తున్న ఆచారాలను ఆదరిస్తూ తమ కుల దైవమైన మహా శివుడు, వీరభద్రుడుని కొలుస్తూ రజకులు బల్లల పండగ నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా కాలనీలోని మౌలిక సదుపాయాలపై స్థానికులనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, మహిళలు పాల్గొన్నారు.

నేడు టూరిస్ట్ పోలీస్ స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : విశాఖలో పర్యటించే సందర్శకుల భద్రత, పర్యాటకులకు నగర సమాచారంతో పాటు స్థానిక పోలీసులకు భారం తగ్గించేలా టూరిస్ట్ పోలీస్ స్టేషన్ సోమవారం ప్రారంభం కానుంది. బీచ్ రోడ్డులోని బస్టాప్ వద్ద ప్రారంభం కానున్న ఈ పోలీస్ స్టేషన్‌కు సంబంధించి ఆదివారం నగర పోలీసులు ట్రయల్ రన్ నిర్వహించారు. శని, ఆదివారాల్లో బీచ్ రోడ్డులో వేలాది జనం ఉంటారు. వాళ్లకు ఈ స్టేషన్‌కు సంబంధించి వివరాలు తెలియజేసేలా ఈ ట్రయల్ రన్ సాగింది. ఈ స్టేషన్ గతంలోనే ప్రాంభించాల్సి ఉన్నప్పటి ఈ కాన్సెప్ట్ రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తే బావుంటుందన్న ప్రభుత్వ నిర్ణయంతో సోమవారానికి వాయిదా పడింది. ఈ క్రమంలో సోమవారం ఏపీ సిఎం జగన్ వర్చువల్ ద్వారా రాష్ట్రంలోని టూరిస్ట్ పోలీస్ స్టేషన్లను ప్రారంభించనున్నారు.

'ఇంటికొక ఉద్యోగం'

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఇంటికొక ఉద్యోగం ఇప్పించడం ఖాయమని ఉత్తరాంధ్ర పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సమయం హేమంత్ కుమార్ మేనిఫెస్టోని విడుదలచేశారు. ఈ మేరకు తనను గెలిపిస్తే చేసే పనులను రూ.50 స్టాంప్ పేపర్‌పై రాసి, మాట తప్పితే కేసు పెట్టవచ్చని పట్టభద్రులకు తెలియజేస్తూ, సిబిఐ మాజీ జెడి వీవీ లక్ష్మీనారాయణతో సాక్షి సంతకం పెట్టించి ఆదివారం సిరిపురం వద్ద మేనిఫెస్టోను విడుదలచేశారు. మేనిఫెస్టోలో పేర్కొన్న వివరాలిలావున్నాయి... ప్రైవేట్ పాఠశాలల ఫీజుల తగ్గింపు, ఇంటికొక ఉద్యోగం ఇప్పించేందుకు జాబ్ కేలండర్, మెగా డీఎస్సీ, పోలీస్ శాఖ, జెఎల్, డిఎల్, జిల్లా గ్రంథాలయాలలో ఉద్యోగాలు, బ్యాక్ లాగ్ ఉద్యోగాలకు ఏటా నోటిఫికేషన్ ఇచ్చేలా చూస్తాను. ప్రతి నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు పెట్టి ఉద్యోగాలు వచ్చేలా చూస్తామని, ఎంప్లాయిమెంట్ సెల్ ఓపెన్ చేసి ప్రైవేట్ ఉద్యోగాలు కూడా అందుబాటులో తెస్తాను. కానిస్టేబుల్ ఉద్యోగాలకు 27, ఎస్ఐకి 30 సంవత్సరాలకు, ఎపిపిఎస్‌సి, డిఎస్‌సి ఉద్యోగాలకు జనరల్ అభ్యర్థులకు 47 సంవత్సరాలకు వయోపరిమితి పెంచేలా కృషి చేస్తానని, నిరుద్యోగికి నెలకు రూ.3000 ప్రభుత్వంచే ఇప్పిస్తానని, విశ్వవిద్యాలయాల్లోని కాంట్రాక్ట్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పిస్తామని, హోంగార్డులకు తెలంగాణ తరహాలో జీతభత్యాలు, ట్రాఫిక్ లో పనిచేసిన వారికి అదనపు జీతం ఇప్పించేలా చర్యలు చేపడతానని, పోలీస్, మీడియా మిత్రుల పిల్లలకు కేజీ నుంచి పిహెచ్‌డి వరకు ప్రైవేట్ పాఠశాలలలో ఉచిత విద్యను ఇప్పించే ప్రయత్నం చేస్తానని స్టాంప్ పేపర్ మీద రాసి విడుదలచేశారు. ఈ కార్యక్రమంలో సువర్ణ, మిండి కిషోర్, రూప, వెలువర్తి సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దట్టంగా కురుస్తున్న మంచు

దెబ్బతింటున్న పంటలు

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలో 10 రోజులుగా మంచు దట్టంగా కురుస్తోంది. తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు మంచు ఎడతెరిపి లేకుండా కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఏజెన్సీ ప్రాంతాలను తలపించేలా మంచు కురుస్తుంది. చిన్నపాటి వర్షపు జల్లులు కురుస్తున్నట్లుగా ఉంది. దీంతో ఉదయం పూట ప్రయాణం చేసేవారు అవస్థలకు గురవుతున్నారు. రహదారులన్నీ మంచు కప్పి ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు, మనుషులు కనబడే పరిస్థితి ఏమాత్రం ఉండటం లేదు. వాహనచోదకులు హెడ్ లైట్లు వెలిగించుకుని వెళ్లవలసి వస్తోంది. పాదచారులు రోడ్డుపై నడిచి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు.



పొలాల్లో దట్టంగా కురుస్తున్న మంచు

విపరీతమైన మంచు వల్ల పంటలు పూర్తిగా నాశనమయ్యే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. మంచు వలన ప్రస్తుతం సాగు చేస్తున్న మిరప, వేరుశనగ, నువ్వుల పంటలు దెబ్బతినే పరిస్థితి కనిపిస్తుంది. వీటితో పాటు ప్రస్తుతం పూత దశలో ఉన్న మామిడి, జీడి మామిడికి తీవ్ర నష్టం వాటిల్లనుందని ఆ రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న మంచు రెండు విధాలుగా ఉంది. ఒకరోజు పొగ మంచు, మరో రోజు తేనె మంచు కురుస్తోంది. పొగ మంచు వల్ల పంటలకు అంతగా నష్టం ఉండకపోయినప్పటికీ, తేనె మంచువలన పంటలకు నష్టం వాటిల్లుతుంది. ఈ మంచు వల్ల మిరప, నువ్వులు, వేరుశెనగ పంటల ఆకులు మొద్దుబారి ముడుసుకుపోయి పంట ఎదుగుదల ఏమాత్రం ఉండటం లేదని రైతులు చెబుతున్నారు. ఇదే విధంగా మరికొద్ది రోజులు మంచు పడినట్లయితే ఈ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలన్నిటికీ అపారమైన నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సిఎం బూడి తదితరులు

మెగా రక్తదాన శిబిరం పోస్టరు ఆవిష్కరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి

అమ్మ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మార్చి 12న నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరానికి సంబంధించిన పోస్టరును ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఆదివారం మండలంలోని తారువలో ఉన్న తన క్యాంపు కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం అనేది ప్రాణదానం లాంటిదని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. అమ్మ ఛారిటబుల్ ట్రస్టు చేపడుతున్న సేవలను ఉపముఖ్యమంత్రి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూరెడ్డి బాబూరావు, ట్రస్టు చైర్మన్ గొంప వెంకట్రావు, వైస్ చైర్మన్ సింగంపల్లి అర్జున్, సభ్యులు బొబ్బిలి సన్యాసిరావు, వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు చిరికి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి డిఇఒగా వెంకట లక్ష్మమ్మ

ప్రజాశక్తి-అనకాపల్లి



అనకాపల్లి జిల్లా ఇన్‌ఛార్జి విద్యాశాఖాధికారిగా వెంకట లక్ష్మమ్మ నియమితులయ్యారు. విజయవాడ స్కూల్ ఎడ్యుకేషన్ ఆఫ్ కమిషనర్ కార్యాలయంలో అకాడమిక్ డిప్యూటీ డైరెక్టర్‌గా ఇంత వరకు ఆమె విధులు నిర్వహించారు. ఆమెను అనకాపల్లి ఇన్‌ఛార్జి డిఇఒగా నియమిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

విస్తారంగా జనుము సాగు

ప్రజాశక్తి- కశింకోట

మండలంలోని బయ్యవరం గ్రామం పరిధిలో రైతులు జనుము పంట సాగును విస్తారంగా చేపట్టారు. ఇక్కడ వరి పంట కోతలు అయిన వెంటనే భూములను ఖాళీగా ఉంచకుండా ఆ వెంటనే జనుము విత్తనాలు వేశారు. ప్రస్తుతం పంట ఏపుగా పెరిగింది. రెండు నెలల లోపు ఫలసాయం అందుకొనేలా రైతులు జనుము పంటపై మొగ్గు చూపారు.



ఏపుగా పెరిగిన జనుము పంట

మాపై దయ లేదా?

- నేవీ నిర్వాసితుల ఆవేదన
- 105వ రోజు కొనసాగిన ఆందోళన



ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

ప్రజాశక్తి-రాంబిల్లి

'దేశ రక్షణ కోసం నేవీకి మా భూములు ఇచ్చాం. కాని మా సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. మాపై దయ లేదా?' అని ఎన్ఎఒబి నిర్వాసితులు ప్రశ్నించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనర్సాపురం వద్ద నేవీ ప్రధాన గేట్ ముందు ఎనిమిది గ్రామాల నిర్వాసితులు చేపట్టిన ఆందోళన ఆదివారం నాటికి 105వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ శారదా, వరహా నదుల గుండా వెళ్లి సముద్రంలో చేపల వేట సాగించి జీవనం సాగించేవాళ్లమని తెలిపారు. నేడు నేవీ అనుమతి నిరాకరించడంతో సముద్రంపై వేటకు వెళ్లే పరిస్థితి లేక ఉపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ఎఒబికి భూములిచ్చిన సమయంలోనూ, తరువాత ప్రభుత్వం, నేవీతో చేసుకున్న ఒప్పందాలు నేటికీ అమలు కాకపోవడం అన్యాయమన్నారు. తమ సమస్యలపై 105 రోజులుగా ఆందోళన చేస్తున్నా కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పెండింగ్ ప్యాకేజీలు ఇవ్వాలని, జెట్టీ నిర్మాణం చేపట్టాలని, అంత వరకు నేవీ లోపల నుంచి చేపల వేటకు ఆధార్ ఆధారంగా అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 8 గ్రామాల నిర్వాసితులు, నేవీ నిర్వాసిత జెఎసి నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు దారుణం

ప్రజాశక్తి-దేవరాపల్లి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై ఇటీవల సోషల్ మీడియాలో వేదికగా హమారా ప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు అనకాపల్లి జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు కాటపల్లి అప్పారావు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్ ఒక హాలా ప్రసాద్ అని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో హైలెట్ కావడానికి అంబేద్కర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేశారా? లేక దీని వెనుక ఎవరి హస్తమైనా ఉందా? అనే కోణంలో పోలీసులు విచారణ చేయాలని కోరారు. ప్రపంచంలోనే అతిపెద్ద గణతంత్ర దేశానికి మూలస్తంభమైన రాజ్యాంగం మీద, రాజ్యాంగ నిర్మాత మీద దాడి చేసి దేశాన్ని విచ్ఛిన్నం చెయ్యటానికి కుట్ర పన్నారని అనిపిస్తుంది, ఇటువంటి ఆగడాలను సహించేది లేదని హెచ్చరించారు. మతాల మధ్య, కులాల మధ్యలో చిచ్చుపెట్టి పబ్బం గడుపుకుంటున్న రాజకీయ పార్టీలకు హెచ్చరిస్తున్నామని, అంబేద్కర్‌ను రాజ్యాంగాన్ని టార్గెట్ చేస్తే మేము మిమ్మల్ని, మీ పార్టీలను ఓట్లతో టార్గెట్ చేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు. హమారా ప్రసాద్ వెనుక భారతదేశ మతోన్మాదుల హస్తం ఉందనే కోణంలో విచారణ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

బ్రాండిక్స్ కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



మహిళలకు కంటి అద్దాలు అందజేస్తున్న బ్రాండిక్స్ భారతీయ భాగస్వామి దొరస్వామి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

బ్రాండిక్స్ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్రాండిక్స్ అపరల్ పార్కు పక్కనే ఉన్న సిఎస్ఆర్ క్యాంపు వద్ద ఆదివారం నిర్వహించిన 100వ ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బ్రాండిక్స్ సంస్థ సామాజిక కార్యక్రమాల్లో భాగంగా శంకర్ ఫౌండేషన్ వారి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి అనకాపల్లి, విశాఖతో సహా చుట్టుపక్కల జిల్లాల నుంచి 525 మంది పైగా హాజరయ్యారు. వీరిలో 509 మందికి శంకర్ ఐ ఫౌండేషన్ ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు చేశారు. అనంతరం కంటి అద్దాలు అవసరమైన 355 మందికి శిబిరం వద్దనే తయారు చేయించి పంపిణీ చేశారు. 76 మందికి కంటి సంరక్షణ కోసం మందులు ఇచ్చారు. నిపుణులచే చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ కంటి సమస్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. ఈ శిబిరంలో నిర్వహించిన పరీక్షల్లో గుర్తించిన 47 మందికి కేటరాక్ట్ ఆపరేషన్లు, ఇతర కంటి శస్త్ర చికిత్సలు చేయించుకోవాల్సిందిగా వైద్యులు సూచించారు.

ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ భారతీయ భాగస్వామి దొరస్వామి మాట్లాడుతూ బ్రాండిక్స్ సంస్థ, బ్రాండిక్స్ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 2017 జనవరి 22న ఉచిత కంటి వైద్య శిబిరాల నిర్వహణ ప్రారంభించామని, ఇప్పటి వరకూ నిర్వహించిన 100 శిబిరాల ద్వారా 39 వేల మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. 26 వేల కంటి అద్దాలను అందించినట్లు, 3,700 మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయించినట్లు పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో మరింత మందికి ఉచిత కంటి వైద్య సేవలు అందించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని దొరస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాండిక్స్ సిబ్బంది, శంకర్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

దొరస్వామికి సన్మానం

బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామిని ఆదివారం పూడిమడక గ్రామ మాజీ సర్పంచ్ చేపల వెంకటరమణ ఆధ్వర్యంలో మత్స్యకారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ అనేకమందికి కంటి సమస్యలు నివారణకు ఎంతగానో కృషి చేసిన దొరస్వామికి ఈ ప్రాంత ప్రజలు రుణపడి ఉంటారని తెలిపారు. మిగిలిన పరిశ్రమల ప్రతినిధులు కూడా సిఎస్ఆర్ నిధులతో సంక్షేమ పథకాలు చేపట్టాలని ఆయన కోరారు.

వైజ్ఞానిక యాత్రకు ప్రశాంతి విద్యార్థులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఢిల్లీలో ఈ నెల 13 నుంచి 24 వరకు జరగనున్న వైజ్ఞానిక యాత్రకు స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 9 మంది విద్యార్థులు బయలుదేరారు. వైజ్ఞానిక యాత్రలో భాగంగా ఢిల్లీ, ఐఐటీ, నీతి ఆయోగ్, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, తదితర ప్రదేశాలను సందర్శిస్తారని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ వైజ్ఞానిక యాత్రకు కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. వైజ్ఞానిక యాత్రకు వెళ్లిన విద్యార్థులను ప్రశాంతి విద్యాసంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ అభినందించారు.



వైజ్ఞానిక యాత్రకు వెళ్లిన విద్యార్థులు వీరే..

దోచుకోవడం, దాచుకోవడమే వైసిపి నేతల లక్ష్యం

- అమర్‌నాథ్ అక్రమ ఆస్తుల సంపాదనపై బహిరంగ చర్చకు సిద్ధమా?
- టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధ వెంకన్న

ప్రజాశక్తి-అనకాపల్లి

వైసిపి నేతలు దోచుకోవడం దాచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధ వెంకన్న విమర్శించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నంలో సుమారు రూ.50 వేల కోట్ల విలువైన భూములను మంత్రి అమర్నాథ్ దోచుకుని అందులో విజయసాయి రెడ్డికి వాటాలు ఇచ్చారని ఆరోపించారు. అమరనాథ్‌కు మంత్రి పదవి రావడంలో విజయసాయిరెడ్డి కీలక పాత్ర పోషించారన్నారు. అమర్నాథ్ ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు ఆయన ఆస్తుల విలువ, ప్రస్తుత ఆస్తుల విలువపై బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. అక్రమ ఆస్తులు రుజువైతే రాజకీయ సన్యాసం తీసుకుంటారా అని సవాలు విసిరారు. టిడిపి అమర్‌నాథ్‌కు రాజకీయ భిక్ష పెట్టిందని, పార్టీ మారి మంత్రి పదవి వచ్చిన తర్వాత తమ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్, లోకేష్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని తెలిపారు. అనకాపల్లిలో కాపు సామాజిక భవనానికి టిడిపి మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ స్థలం ఇస్తే, ఆ స్థలాన్ని వైసిపి కార్యాలయంగా మార్చుకోవడం దారుణమన్నారు. అమర్నాథ్ ఎక్కడ పోటీ చేసినా గెలిచే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు పీలా గోవింద సత్యనారాయణ, పివిజి కుమార్, ప్రగడ నాగేశ్వరరావు, నాయకులు మల్ల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుద్ధ వెంకన్నను సాలువతో కప్పి జ్ఞాపికతో సత్కరించారు.



బుద్ధ వెంకన్నను సత్కరిస్తున్న టిడిపి నాయకులు



ఆర్థిక సహాయం అందజేస్తున్న యాదవ సంఘం నాయకులు

గాయపడిన విద్యార్థినికి పలువురు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి- సబ్బవరం : ప్రమాదంలో రెండు కాళ్లు విరిగిపోయిన విద్యార్థినికి జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆపన్న హస్తం అందించింది. మండలంలోని అంతకాపల్లి పంచాయతీ శివారు ఒమ్మివానిపాలెం గ్రామానికి చెందిన విద్యార్థిని కోన సరస్వతి ఇటీవల రెండు ఆటోలు డీకొన్న ప్రమాదంలో రెండు కాళ్ళు విరిగిపోయాయి. దీంతో జిల్లా యాదవ్ సంఘం అధ్యక్షులు రూ.30వేలు నగదు, ఒక నెలకు సరిపడే నిత్యావసర సరకులను ఆదివారం అందజేశారు. టెక్కలిపాలెం సర్పంచ్ గొంప సత్యవమ్మ నాయనప్పల కుమారుడు ఎన్ఆర్ఐ గొంప వెంకట రమణ తన వంతు ఆర్థిక సహాయంగా రూ.40 వేలు సరస్వతి కుటుంబానికి అందజేశారు. సరస్వతి నర్సింగ్ చదువునకు అయ్యే ఫీజులు భరించేందుకు హామీ ఇచ్చారు. ఈ సంఘటన తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ సరస్వతిని పరామర్శించి కుటుంబాన్ని రూ.25 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యాదవ్ సంఘ అధ్యక్షులు భరిణికాని బాబురావు, పెందుర్తి నియోజకవర్గ అధ్యక్షులు ఉప్పిలి కనకరాజు, పిఏసీఎస్ వైస్ చైర్మన్ పల్లా కృష్ణ, కోరాడ శ్రీనివాసరావు, పల్లా తాతారావు, పైల వెంకట రమణ, పంచాడ శ్రీను, ఆకుల గణేష్, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, సబ్బవరపు ముత్యాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సికి నిధులు మంజూరుపై హర్షం

ప్రజాశక్తి-దేవరాపల్లి : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతన భవన నిర్మాణం కోసం కోటి 70 లక్షల రూపాయలు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మంజూరు చేయించడం పట్ల జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి కెవి రమణ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇదివరకు ఎన్నడూ లేని విధంగా బూడి హయాంలో దేవరాపల్లిలో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. నాడు- నేడు కింద ఆసుపత్రుల అభివృద్ధిలో భాగంగా రాష్ట్రంలో మూడు ఆస్పత్రులకు రూ.7.44 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయగా, అందులో దేవరాపల్లి ఆసుపత్రి ఉండటం వెనుక బూడి కృషి ఎనలేనిదని తెలిపారు. ఈ భవన నిర్మాణం పూర్తయితే దేవరాపల్లి మండలంతో పాటు అల్లూరి జిల్లా ఏజెన్సీలో ఉన్న సుమారు 200 గ్రామాలకు వైద్య సేవలు పూర్తిగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

మద్యపాన నిషేధం హామీ ఏమైంది?

ప్రజాశక్తి-అనకాపల్లి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కల్తీ మద్యానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారారని టిడిపి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ విమర్శించారు. జీవీఎంసీ 84వ వార్డు కొండ కొప్పాకలో ఆదివారం టిడిపి నిర్వహించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో మద్య నిషేధం చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజల ప్రాణాల కన్నా మద్యంపై వచ్చే ఆదాయమే ముఖ్యం అన్నట్టు వ్యవహరిస్తుందని విమర్శించారు. కల్తీ మద్యాన్ని అరికట్టాల్సిన ప్రభుత్వమే కల్తీ మద్యాన్ని ప్రోత్సహించడం దారుణమన్నారు. కల్తీ మద్యం తాగి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేని మద్యం బ్రాండ్లు జగన్మోహన్ రెడ్డి కుటుంబీకులు తయారు చేస్తున్నారని ఆరోపించారు. టిడిపి అధికారంలోకి రాగానే మద్యంపై ఉక్కు పాదం మోపుతామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మాదంశెట్టి నీలబాబు, కొప్పాక బాబురావు, మిర్తిపాటి గోపాలరావు, మురళి, గిరి, 84వ వార్డు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

ఉచిత కంటి వైద్య శిబిరం



నేత వైద్య శిబిరంలో పాల్గొన్న వాసవి క్లబ్, ఆది ఆంధ్ర సభ్యులు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి వాసవి క్లబ్, ఆది ఆంధ్ర సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్ అంబేద్కర్ నగర్ సీతా రామాంజనేయ స్వామి ఆలయంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి, రాజా ఆప్టికల్స్ అండ్ కంటి ఆసుపత్రి సహకారంతో జరిగిన ఈ శిబిరాన్ని 83వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి జాజుల రమేష్ ప్రారంభించారు. పలు సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు మనిషికి అత్యంత అవసరమైన కంటి చికిత్సలు నిర్వహించడం అభినందనీయం ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. శిబిరంలో 220 మంది నేత్ర పరీక్షలు నిర్వహించగా, 42 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి ఆపరేషన్లకు ఎంపికైన వారిని పంపిస్తామని రాజా కంటి ఆసుపత్రి, ఆప్టికల్స్ అధినేత పూసర్ల రాజా తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ దేవి ప్రభాకర్, వాసవి క్లబ్ అధ్యక్షులు తాటికొండ శ్రీనివాసరావు, తాటికొండ జీవన్, రామ్మూర్తి, కడిమిశెట్టి రాము కెవి సత్యనారాయణ, కొత్త గోపాల కృష్ణ, గుండా రమేష్ గుప్తా, బత్తుల సతీష్, ఆది ఆంధ్ర సంఘం అధ్యక్షులు బెల్లాన నూకరాజు, నడుపూరు శ్రీను, బెల్లాన వెంకట శివాజీ, సారికి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

280 మందికి కంటి పరీక్షలు

కశింకోట : మండలంలోని జె.తుని గ్రామంలో రామ్‌కో సిమెంట్స్ కంపెనీ సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి వైద్యులు ప్రవీణా 280 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 200 మందికి కళ్ళ అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోన అరుణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ కంటి చూపు చాలా ప్రధానమన్నారు. ఇలాంటి కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామ్‌కో సిబ్బంది యువరాజ్, కె.రవికుమార్, వైసిపి నాయకులు కోన నాగేశ్వరరావు, కెవివి.సత్యనారాయణ, మజ్జి గణేష్, ఎస్‌వి నాగేశ్వరరావు, మునగపాక గోవింద్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణుడు

పర్యావరణ పరిరక్షణతోనే పుడమి సంరక్షణ



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న గ్రీన్ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి-అనకాపల్లి

పర్యావరణ పరిరక్షణతోనే పుడమి తల్లికి సంరక్షణ అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మల్ల బుల్లిబాబు అన్నారు. స్థానిక గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని పిసినికాడ గ్రామం సాయి నగర్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ తప్పిదాల కారణంగా ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్నాయని, పర్యావరణం దెబ్బతిని కాలుష్యం పెరుగుతుందని తెలిపారు. గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ చేపడుతున్న పర్యావరణ కార్యక్రమాలను ఆయన అభినందించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఫణి భూషణ్ శ్రీధర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం అనేక కార్యక్రమాలు క్లబ్ ద్వారా నిర్వహిస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా బుల్లిబాబును క్లబ్ తరఫున సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అటవీ శాఖ అధికారి వినోద్ కుమార్, ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, వై సూరి అప్పారావు, కర్రి హనుమంతరావు, పి ఉమామహేశ్వరరావు, మల్ల మురళి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేన నాయకులు

బ్రాండిక్స్ రెండో పైపులైన్ పనులు నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఆధ్వర్యంలో వేస్తున్న రెండువ పైపులైన్ పనులను వెంటనే నిలుపుదల చేయాలని జనసేన పార్టీ మత్స్యకార నాయకుడు సిహెచ్.అప్పారావు డిమాండ్ చేశారు పూడిమడక గ్రామంలో జగన్నాథ స్వామి ఆలయంలో ఆదివారం గ్రామ మత్స్యకారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రాండ్స్ మొదటి పైపులైన్ వేసినప్పుడు చేసిన తీర్మానం నేటి వరకు అమలు కాలేదన్నారు. మత్స్యకారులకతటదని చెప్పారు. 2011లో జాయింట్ యాక్షన్ కమిటీతో జరిగిన చర్చల్లో ఒక్క పైపులైను వేయటానికి మాత్రమే అగ్రిమెంట్ కుదుర్చుకున్నట్లు గుర్తు చేశారు. రెండో పైపులైన్ వేసినట్లయితే మళ్లీ ప్యాకేజీ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని యాజమాన్యం చెప్పిందని తెలిపారు. అప్పట్లో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం రూ.2,70,000 చొప్పున 370 మంది మత్స్యకారులకు ప్యాకేజీ వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. పైప్‌లైన్ విషయం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, ఎంపీ విజయసాయిరెడ్డికి, మంత్రి అమర్‌నాథ్‌కు తెలియజేసినట్లు చెప్పారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని పక్షంలో పైపులైన్ పనులను అడ్డుకొని ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెరుగు అప్పలనాయుడు, అప్పలరాజు, ఏరిపల్లి గంటల రావు, కృష్ణ పాల్గొన్నారు.

పోలీసు ఇన్‌ఫార్మర్ నెపంతో మాజీ సర్పంచ్ హత్య

ప్రజాశక్తి-చింతూరు : చత్తీస్‌ఘడ్ రాష్ట్రం, దంతేవాడ జిల్లా, గీదం బ్లాక్ పరిధిలోని బార్సూర్ పోలీస్ స్టేషన్ సమీపంలో హితమెట్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రామ్‌దార్ అలీమ్ (50)ను పోలీసు ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు హత్య చేశారు. రాందార్ అలీమ్ శనివారం వేరే గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా, మావోయిస్టులు కాపుగాచి కత్తులతో దాడి హత్య చేశారు. అనంతరం సంఘటనా స్థలంలో మావోయిస్టు పార్టీ బస్టర్ డివిజన్ కమిటీ పేరుతో లేఖను విడిచిపెట్టి వెళ్లారు. 2017 నుండి రాందార్ అలీమ్ పోలీసులకు సమాచారం అందజేస్తూ ఇన్‌ఫార్మర్‌గా కొనసాగుతున్నాడని ఆ లేఖలో మావోయిస్టులు ఆరోపించారు.

3 కిలోల ఐఇడి బాంబు నిర్వీర్యం

ప్రజాశక్తి-చింతూరు : బీజాపూర్ జిల్లాలోని అవపల్లి- ఉసూరు రహదారిలో మావోయిస్టులు అమర్చిన 3 కిలోల ఐఇడి బాంబును పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకొని నిర్వీర్యం చేశారు. ఈ రహదారి ప్రారంభానికి వచ్చే పోలీసులను టార్గెట్ చేసుకొని శివాలయం సమీపంలోని ప్రధాన రహదారికి 50 మీటర్ల దూరంలో ఉన్న అటవీ ప్రాంతంలో అమర్చిన ఈ బాంబును ముందస్తు సమాచారం మేరకు పోలీసులు, సిఆర్పిఎఫ్ 196 సీతాపూర్ క్యాంప్ బలగాలు దానిని గుర్తించి నిర్వీర్యం చేశారు.

కుట్టుమిషన్లు యథాస్థానానికి ..



యథాస్థానంలో ఉంచుతున్న కుట్టుమిషన్లు

విశాఖకు తరలించిన ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్ర కుట్టుమిషన్లు

అనకాపల్లి డిఆర్‌డిఎ అధికారుల చొరవతో మళ్లీ వెనక్కి..

వినియోగంలోకి తేవాలని పలువురి వినతి

ప్రజాశక్తి -కోటవురట్ల : విశాఖపట్నం తరలించుకుపోయిన ఫ్యాషన్ టెక్నాలజీ కుట్టుమిషన్లను అనకాపల్లి జిల్లా డిఆర్‌డిఎ అధికారుల చొరవతో మళ్లీ వెనక్కు రప్పించారు. 2005-06లో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో ఫ్యాషన్ టెక్నాలజీ శిక్షణకు కోట్లు వెచ్చించి కుట్టు మిషన్లు ఇటీవల విశాఖ జిల్లాకు డిఆర్‌డిఎ అధికారులు తరలించుకుపోయారు. దీనిపై అనకాపల్లి జిల్లా డిఆర్‌డిఎ అధికారులు వెంటనే స్పందించి తీసుకువెళ్లిన మిషన్లు తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు, మండల వెలుగు ఎపిఎం రమణకుమారి కుట్టు మిషన్లు తీసుకువెళ్తున్న సమయంలోనే వద్దని వారించినా వినకపోవడంతో జిల్లా అధికారులకు సమాచారం అందించారు. అనకాపల్లి జిల్లాకు చెందిన ఆస్తులు విశాఖ జిల్లాకు ఎలా తీసుకువెళ్తారని జిల్లా అధికారులు స్పందించడంతో ఆదివారం వాటిని యథాస్థానంలో తెచ్చి ఉంచారు

రాజశేఖరరెడ్డి హయాంలో ఆర్భాటంగా ప్రారంభించినప్పటికీ, ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్రం పనితీరు ఆరంభశూరత్వంగానే మిగిలిపోవడంతో మహిళలకు ఎటువంటి శిక్షణ, ఉపాధి కల్పించలేకపోయారు. ఖరీదైన మిషన్లు, ఆధునిక సౌకర్యాలు కల్పించినప్పటికీ, వినియోగంలో సంబంధిత అధికారుల వైఫల్యం వల్ల మిషన్లన్నీ నిరుపయోగంగా మారిపోయాయి. ప్రస్తుతం మండలానికి చెందిన పలువురు మహిళలు అచ్యుతాపురం బ్రాండిక్స్ వంటి కంపెనీలకు ఉపాధికి వెళుతున్న నేపథ్యంలో ఈ కేంద్రం సక్రమంగా ఉపయోగపడి ఉంటే వారే శిక్షణ పొంది స్వయంఉపాధి పొందేవారని అంటున్నారు. అనకాపల్లి జిల్లాగా ఏర్పడిన తరువాత అయినా అధికారులు స్పందించి ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్రాన్ని అందుబాటులోకి తెస్తారని భావించినా, మిషన్ల తరలింపు ద్వారా ఏకంగా మూసేసే చర్యలు చేపట్టడం దారుణమని, ఇప్పటికైనా అధికారులు స్పందించి దీన్ని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

మంచినీటి బావికి మరమ్మతులు



మంచినీటి బావికి మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి - రావికమతం : మండలంలో కవగుంట గ్రామంలో నేటికీ తాగునీటికి వినియోగంలో ఉన్న 120ఏళ్లనాటి బావికి మరమ్మతులు చేపట్టినట్లు సరపంచ్ దాసరి సూర్యకుమార్ వరహాలు తెలిపారు. మంచినీటి బావికి గచ్చు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో దాన్ని తొలగించి, తిరిగి బావి చుట్టూ నూతనంగా గచ్చు, గట్టు, కాలువలకు మరమ్మతులు చేపట్టారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పురాతనమైనప్పటికీ, నేటికీ ఇదే బావి నీటిని స్థానికులు వినియోగిస్తున్నారు. ఈ బావి నీరు పరిశుభ్రంగా, రుచికరంగా ఉండడమే దీనికి కారణమంటున్నారు. పండగలు, పలు శుభకార్యాలు జరిగినప్పుడు పూర్వీకులు నుంచి ఆనవాయితీగా ఈ బావి నీటిని తీసుకెళతారు. గ్రామంలో చేతిపంపు బోర్లు, రక్షిత మంచినీటి పథకం కుళాయిలు ఉన్నప్పటికీ నేటికీ దాదాపు రెండు వేల జనాభా ఉన్న కవగుంట గ్రామస్తులు ఈ బావి నీటినే తాగేందుకు ఆసక్తి చూపుతుంటారని, అందుకే ఏటా ఈ బావిలోని పాత నీటిని, కింద పేరుకుపోయిన మట్టిని తొలగించి శుభ్రపరుస్తామన్నారు. వేసవిలో సైతం సమృద్ధిగా నీరుండడం, ప్రజలంతా ఈ నీటిని వాడేందుకు ఆసక్తి చూపడం వంటి కారణాలతో దీన్ని బాగుచేసినట్లు తెలిపారు. బావిలోని పూడిక తొలగింపుతోపాటు, బావిని పటిష్టపరిచినట్లు తెలిపారు.

ఉచిత బీమా సౌకర్యం కల్పనకు కృషి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : జర్నలిస్ట్ యూనియన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) సమావేశం ఆదివారం నర్సీపట్నంలో నిర్వహించారు. సమావేశంలో యూనియన్ సమస్యలు, జర్నలిస్టులపై ప్రభుత్వం అనుసరిస్తున్న ధోరణిపై చర్చించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యలమంచిలి వేణు మాట్లాడుతూ, ఈ నెల16న నర్సీపట్నం జాప్ యూనియన్ రెండవ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. త్వరలోనే సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నిక, సభ్యుల శ్రేయస్సే లక్ష్యంగా ఒక్కొక్కరికి రూ.ఐదు లక్షల బీమా సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జాప్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఎస్ఆర్ కె రాజు, కార్యదర్శి లంక శివ, ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు వర్రే రమణ, ఎలక్ట్రానిక్ మీడియా గౌరవాధ్యక్షులు ఎం.ఎ.రాజు, ఏసుబాబు, జాప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి సామాజిక తనిఖీ

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ఉపాధి పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ పక్కగా పారదర్శకంగా నిర్వహించాలని ఎంపిడిఒ సీతారామరాజు, ఎస్ఆర్ పి రామారావు సూచించారు. ఆదివారం .మండల పరిషత్ కార్యాలయంలో ఆడిట్ బృందాలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో చేపట్టిన పనులకు సంబంధించి రికార్డులను ఆడిట్ టీంకు అందజేసారు. తనిఖీలకు సంబంధించిన విధివిధానాలపై అవగాహన కల్పించారు ఎపిఒ శ్రీనివాసరావు డిఆర్‌పిలు, విఆర్‌పిలు ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు



.సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్‌పి

రాజకీయ పార్టీల ఫ్లెక్సీల తొలగింపు

ప్రజాశక్తి-రోలుగుంట : ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడంతో కోడ్ అమల్లోకి వచ్చిందని రోలుగుంట ఎంపిడిఒ కె.ప్రభాకరరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో రాజకీయ పార్టీల నాయకుల ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలని ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులకు ఆదేశించామన్నారు. ఎన్నికల కోడ్ పక్కాగా అమలయ్యేటట్టు చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు.

అరటి తోట నరికివేతపై ఫిర్యాదు



అరటి చెట్టు మొదలు

ప్రజాశక్తి మాకవరపాలెం: అరటితోట నరికివేతపై పోలీసులకు పిర్యాదు చేశామని రెడ్డిలక్ష్మి, రెడ్డి నాయడమ్మ అన్నారు. మాకవరపాలెం మండలం వెంకన్న పాలెం గ్రామంలో తమ సాగులో ఉన్న అరటి తోటలను రమణ శ్రీను, రెడ్డి ఆక్కునాయుడు రెడ్డి అబద్దం అనే నలుగురు వ్యక్తులు దౌర్జన్యంగా వచ్చి అరటి తోటను పూర్తిగా నరికేశారని బాధితులు ఫిర్యాదు చేశారు.

గతంలో కూడా ఈ వక్తులు మామిడి తోటను పూర్తిగా నరికివేయడంతో అప్పట్లోనూ అనకాపల్లి ఎస్‌పికి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి వదలేయడంతో మళ్లీ దౌర్జన్యానికి తెగబడ్డారని బాధితులు లబోదిబోమంటున్నారు. బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.

రూ.25 లక్షలతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - అనంతగిరి : బొర్రా పంచాయతీ పరిధిలోని గ్రామాలకు రూ 25 లక్షలతో సిసి రోడ్లు తాగునీటి పనులు చేపట్టామని సర్పంచ్ జన్ని.అప్పారావు తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బొర్రా గుహలు ఆదాయంలో వచ్చే 25శాతం నిధులతో గంగా కోయిట్‌గుడ, కటికి, జీలగెడ్డ, డేకపురం గ్రామాలకు వీధి రోడ్లు, మరికొన్ని గ్రామాలకు తాగునీటి మరమ్మతు పనులు చేపట్టామన్నారు. బొర్రా గుహలకు వచ్చే నిధులతో పంచాయతీ అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్‌కు విన్నవించగా, కలెక్టర్ ఆదేశాలతో పర్యాటకశాఖ నిధులు మంజూరు చేసిందన్నారు. శివరాత్రి ఉత్సవాలకు సరిపడా నిధులను కూడా చెల్లిస్తామని ఎపి పర్యాటకశాఖ హామీనిచ్చిందన్నారు.

202 కిలోల గంజాయి స్వాధీనం

ముగ్గురు అరెస్ట్..మరో ముగ్గురు పరారీ

నిందితుల్లో ఒకరు ఆర్‌పిఎస్‌ఎఫ్ కానిస్టేబుల్

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: అక్రమంగా తరలిస్తున్న 202 కిలోల గంజాయిని పోలీసులు ఆదివారం ఉదయం పట్టుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేయగా, మరో ముగ్గురు పరారయ్యారని ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు. స్థానిక ఎస్ఐ ఆర్ సంతోష్‌కుమార్ ఆదివారం చెప్పిన వివరాలివి. ఒడిశా పాడువ ప్రాంతం నుండి విశాఖపట్నం మీదుగా ఉత్తరప్రదేశ్‌కు రెండు కార్లలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు అరకులోయ మండల కేంద్రంలోని ఎన్‌టిఆర్ గ్రౌండ్ జంక్షన్ వద్ద ఆదివారం ఉదయం ఎస్ఐ ఆర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపడుతుండగా, రెండు కార్లలో 202 కిలోల గంజాయి గుర్తించారు. కారుల్లోని నిందితులు పరారీకి యత్నించగా ముగ్గురిని పట్టుకున్నామని, మరో ముగ్గురు పరారయ్యారని ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన నిందితుల్లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నో ప్రాంతానికి చెందిన నరేంద్రకుమార్ అనే ఆర్‌పిఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఉన్నారు. అదే ప్రాంతానికి చెందిన రాహుల్ సింగ్, పాడువ ప్రాంతానికి చెందిన క్రైసబ్ అనంత్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. రెండు కార్లు సీజ్ చేశామని తెలిపారు. పరారైన ముగ్గురు నిందితులను త్వరలో పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

రెన్యువల్ చేసి ఆదుకోండి

గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి మాతృభాషా వాలంటీర్ల వినతి

ప్రజాశక్తి పాడేరు/ పాడేరు టౌన్ : తమ సేవలను రెన్యువల్ చేసి వెంటనే విధుల్లో చేర్చుకునేలా ఉత్తర్వులు ఇప్పించాలని గిరిజన ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలల మాతృభాషా వాలంటీర్లు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పి రాజన్న దొరను కోరారు. శనివారం సాలూరులో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నివాసానికి వెళ్లిన ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి జిల్లాల, మాతభాష విద్యా వాలంటీర్లు ఈ మేరకు మంత్రికి వినతి పత్రం అందజేశారు. 2022 -23 విద్యాసంవత్సరంలో రెన్యువల్ చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. నవంబర్‌లో గిరి విజ్ఞాన సంబరాలకు పాడేరు వచ్చిన గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే అప్పట్లో పాడేరు ఐటిడిఎలో వినయపూర్వకంగా కలిసి, మాకు రెన్యువల్ చేయాలని వినతి పత్రం ఇచ్చామని వారు మంత్రికి విన్నవించారు. దీనిపై వెంటనే స్పందించి అల్లూరి సీతారామరాజు జిల్లా, కలెక్టర్ సుమిత్ కుమార్ , పాడేరు ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకష్ణ సమాలోచన చేసి ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లా మాతభాష విద్యా వాలంటీర్లను మాత్రమే విధులకు హాజరు కావాలని ఆదేశాలు ఇచ్చారని, కానీ రెన్యువల్ ఉత్తర్వులు నేటికీ ఇవ్వలేదన్నారు. దీనిపై ఉపముఖ్యమంత్రి చొరవ తీసుకని, అల్లూరితోపాటు ఇతర జిల్లాల్లోని భాషా వాలంటీర్లను రెన్యువల్ చేయాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి, న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో మాతభాష విద్యా వాలంటీర్లు సంఘం జిల్లా కార్యదర్శి కొర్ర సర్భునాయుడు, మర్రి చిట్టిబాబు, వంతల జోగేశ్వరరావు. శ్రీకాకుళం జిల్లా, విజయనగరం జిల్లా, మాతభాష విద్యా వాలంటీర్లు ఉన్నారు

విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని బూర్జ పంచాయతీ మజ్జివలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాలలో సుమారు 500మంది విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలున నిర్వహించారు. గాయత్రి విద్యా పరిషత్, సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ ఆదేశాలతో నిర్వహించిన వైద్యశిబిరంలో సాధారణ వ్యాధులకు వివిధ పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు పంపిణీ చేపట్టారు.

అనంతరం విద్యార్థులకు సికిల్‌సెల్ ఎనీమియా నిర్ధారణకు పరీక్షలు చేశారు. గాయత్రి విద్యాసంస్థ డైరెక్టర్ శర్మ, ప్రిన్సిపల్ రజిని, ఎంఇఒ ఎస్ రామచంద్రరావు, శిశు సంక్షేమ శాఖ సిడిపిఒ, సిహెచ్ బాలమణి దేవి, విద్యాశాఖ కోఆర్డినేటర్ వి.జయరాజు, ఎన్‌ఆర్‌ఐ, బృందం తదితరులు పాల్గొన్నారు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీలోరైతులు, మహిళలు

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : మండలంలోని కొనవానిపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న ఆదేశాలతో ఎం.టి.రామ గోవింద్ సూచనలతో కొనవానిపాలెం మహిళా రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలో రైతులకు మహిళ సంఘాలు సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో నవధాన్యాల సాగు, పిఎమ్‌డిఎస్ గురించి రైతులకు వివరించారు. కొనావాని పాలెం గ్రామం లో మహిళ సంఘాల సభ్యులు. రైతులతో 'నవధాన్యాలు సాగు - నేలతల్లికి బాగు' అనే నినాదాలతో ర్యాలీ చేశారు. ప్రకృతి వ్యవసాయం లాభాలు, నవధాన్యాల సాగుతో ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొన అప్పలరాజు మామిడి నాగరాజు ధారబోయిన లోవరాజు , కొర్ని బాబ్జి కోన గురాచార్యులు, రైతులు,గ్రామ యువత పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ రామ గోవిందు, ఎల్. రాము, పి.అర్‌పి నాగ గోవిందు, ఎల్ 3 లు కాసులు, దుర్గా, నందిని, లావణ్య, అనురాధ, కనకారావు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి పంచాయతన దేవాలయంలో 8వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, కుంకుమపూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణతో నర్సీపట్నం పురవీధుల్లో మహిళలు 108 కళాశాలతో ఊరేగించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో దాదాపు మూడు వేలమంది పాల్గొన్ని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. మహిళలను ప్రోత్సహిస్తూ లక్కిడీప్ ద్వారా పలు బహుమతులు అందించారు. గోపూజ, హోమం పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఆలయంలో మహిళల విష్ణు, లలితా సహస్రనామ పారాయణంతో వార్షికోత్సవ వేడుక ముగిసింది. వార్షికోత్సవ విజయవంతానికి సహకరించిన వారందరకీ ఆలయ కమిటీ అధ్యక్షులు దేవత కామేష్, కో ఆప్షన్ సభ్యులు వెలగా నారాయణరావు కృతజ్ఞతలు తెలిపారు.

విజయ్ సాయిరెడ్డిని కలిసిన చెంగల

ప్రజాశక్తి -పాయకరావుపేట : మాజీ ఎమ్మెల్యే వైసిపి నేత చెంగల వెంకటరావు ఆదివారం వైసిపి ముఖ్యనేత, నాయకులు ఎంపీ విజయసాయిరెడ్డి కలిసారు విశాఖ వచ్చిన విజయసాయిరెడ్డిని చెంగల మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు ఇటీవల కొంతకాలంగా మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు నియోజవర్గంలో విస్తత పర్యటనలు చేస్తున్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను అక్కడికి వెళ్లి వారిని పరామర్శిస్తున్నారు ఈ నేపథ్యంలో విజయ సాయిరెడ్డిని కలవడం నియోజవర్గంలో చర్చనీయాంశమైంది పలువురు పెద్దల ఆశీస్సులతో పార్టీ టికెట్ కోసం చెంగల ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది

బీమా పరిహారం అందజేత

ప్రజాశక్తి- ఎస్ రాయవరం : మండలంలోని భీమవరం గ్రామంలో బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పార్టీ క్రియాశీల కార్యకర్తకు జనసేన అండగా నిలిచింది. జనసేన క్రియాశీల సభ్యత్వం ఉండడంతో బాధితునికి రూ.30వేలు బీమా పరిహారం మంజూరుకాగా, బాధితుడైన నిరుపేద కుటుంబానికి పార్టీ క్రియాశీల వాలంటీర్ లింగంపల్లి జ్యోతి కుమార్ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్, యువ నాయకులు గెడ్డం చైతన్య బాధితుడి ఇంటికి వెళ్లి, వారి తల్లిదండ్రులకు భీమవరం గ్రామం నాయకులు, జనసైనికుల సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో లింగంపల్లి ప్రసాద్, పప్పల శివ,శంకర్, లింగంపల్లి బాలకృష్ణ, భీశెట్టి సతీష్, తాకాశి కిషోర్, మడగల నానాజీ, మడగల రాజు, రామకష్ణ, జానీ, బద్రి, అశోక్, నవీన్, రాంబాబు పాల్గొన్నారు.

అదనపు పైపులైన్‌తో మరణమే శరణ్యం

మెడకు ఉరి తాళ్లు వేసుకుని మత్స్యకారుల వినూత్న నిరసన



మెడకు ఉరి తాళ్ళు వేసుకుని వినూత్న నిరసన తెలుపుతున్న అప్పలరాజు, మత్స్యకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి : హెటిరో డ్రగ్స్ మందుల కంపెనీ రెండవ పైపులైను ఏర్పాటు చేస్తే తమకు మరణమే శరణ్యమని మత్స్యకారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు .పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు చేపట్టిన శాంతియుత మహాధర్నా ఆదివారం 437వ రోజుకు చేరింది. శిబిరం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు మత్స్యకారులతో కలిసి మెడకు ఉరితాళ్ళు బిగించుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఇప్పటికే కంపెనీ నుంచి వెలువడే రసాయనాల వలన తామంతా ఉపాధి కోల్పోయి రోడ్డును పడ్డామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో వేట సాగకపోవటం వలన ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నామని, మరలా రెండో పైపులైను వేస్తే గ్రామాలకు గ్రామాలు పూర్తిగా ఖాళీ చేసి వెళ్లాల్సిన దుర్భర పరిస్థితులు ఏర్పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు, పైపులైను వేయవద్దని, అదనపు పైపులైనుకు అనుమతులు ఇవ్వవద్దని మత్స్యకారులు 14నెలలుగా నిరాటంకంగా పోరాడుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం దారుణమని మండిపడ్డారు. మత్స్యకారుల ను మోసం చేస్తూ పైపు లైన్‌కు అనుమతులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తు న్నామని స్పష్టం చేశారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని కంపెనీ యాజమాన్యానికి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎం.మహేష్ బాబు, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి వాసుపల్లి నూకరాజు,గోసల సోమేశ్వరరావు, పిక్కిరమణ, కోడా కాశీరావు, కారే రాజారావు, కారే కోదండరావు, చొక్కా గోపి, మైలపల్లి బాపూజీ, వాసుపల్లి దేముడు, మైలపల్లి నల్లోడు, వాసుపల్లి శ్రీను, అర్జిల్లి కాశీ, మైలపల్లి దార్రాజు పాల్గొన్నారు.

నేడు రామచంద్రరావు సంస్మరణ సభ

ప్రజాశక్తి - విశాఖపట్నం

గాజువాక లక్ష్మి, లక్ష్మీకాంత్ సినీ కాంప్లెక్స్ థియేటర్స్, గ్రూప్ ఆఫ్ రామచంద్ర హోటల్స్ అధినేత, సేవా కార్యకర్త ఘంటా రామచంద్రరావు సంస్మరణ సభ సోమవారం గాజువాకలోని రామచంద్రా మ్యాక్స్, లక్ష్మి, లక్ష్మీకాంత్ థియేటర్స్ వద్ద జరుగనుంది. రామచంద్రరావు ప్రేమ, ఆప్యాయతలకు మారుపేరుగా నిలిచారు. మహోన్నత వ్యక్తిత్వంతో పలువురి హృదయాలను గెలుచుకున్నారు. 1942 ఏప్రిల్ 12న గంటా వెంకట శేషయ్య, లక్ష్మీకాంతమ్మ దంపతులకు రామచంద్రరావు జన్మించారు. ఈ నెల 5న తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా ఐదేళ్ల క్రితం గాజువాక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో రూ.14 లక్షలతో అదనపు పాఠశాల భవనాన్ని నిర్మించారు. కూర్మన్నపాలెంలో కొన్నాళ్ల పాటు వృద్ధాశ్రమాన్ని నిర్వహించారు. ఏలూరులో రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలను నిర్వహిస్తూ ఎందరికో ఉన్నత విద్యావకాశాలు కల్పించారు. గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో మంచి మనిషిగా పేరుగాంచిన ఆయన పలు హోటళ్లు, సినిమా థియేటర్లలో వందలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. నేడు జరిగే సంస్మరణ సభకు పెద్ద ఎత్తున ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు తరలిరానున్నట్టు కుటుంబీకులు తెలిపారు.



ఘంటా రామచంద్రరావు (ఫైల్)

హాసిని ల్యాబ్‌కు సిఎంసి సర్టిఫికెట్



హాసిని ల్యాబ్


Department of Clinical Biochemistry
Christian Medical College, Vellore - 632004
CMC EXTERNAL QUALITY ASSURANCE SCHEME
(Under the aegis of ACBI)
Certificate of Participation
This is to certify that
HASINI DIAGNOSTIC CENTRE
CLINICAL (LAB), VISHAKHAPATNAM
Lab No. 15123 has participated
in the Chemistry II Program of the External Quality Assurance Scheme
during the year 2022.
Pamela Christudoss
Dr. Pamela Christudoss, M.Sc., Ph.D.
EQAS Coordinator
Professor of Clinical Biochemistry

ప్రజాశక్తి-గొలుగొండ: కచ్చితమైన రోగ నిర్ధారణతోనే రోగికి సరైన వైద్యం అందించవచ్చని, కచ్చితమైన రోగనిర్ధారణ అందించడమే లక్ష్యంగా హాసిని డయాగ్నోస్టిక్ ల్యాబ్‌ను గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలోనే కాకుండా నర్సీపట్నం, అనకాపల్లి జిల్లాలోనే పనిచేస్తోందనిల్యాబ్ టెక్నిషియన్ బివిఆర్.ప్రసాద్ తెలిపారు. ఎవరూ పాటించని విధంగా క్రిష్టియన్ మెడికల్ కాలేజ్(సిఎంసి) రోగ నిర్ధారణ ప్రమాణాలు పాటిస్తూ, నాణ్యమైన రిపోర్టులు అందిస్తున్న ఏకైక మెడికల్ ల్యాబ్‌గా హాసిని డయాగ్నోస్టిక్ పేరుసాధించిందని ల్యాబ్ టెక్నిషియన్ బివిఆర్.ప్రసాద్ పేర్కొన్నారు. దీనిలో భాగంగా సిఎంసి సర్టిఫికేట్ పొందిందన్నారు.

ఇదేం చోద్యం !

- ప్రభుత్వ షెడ్‌లో ప్రయివేటు వాహనాల పార్కింగ్
- నాలుగేళ్లుగా ఆక్రమించుకున్నా పట్టించుకోని అధికారులు
- ఆరుబయటే ప్రభుత్వ, ఉద్యోగుల వాహనాలు



ప్రభుత్వ కార్యాలయ షెడ్‌లో ప్రయివేటు వాహనాలు

ప్రజాశక్తి -కోటవురట్ల : కోటవురట్ల మండల పరిషత్ కార్యాలయం వద్ద వింత పరిస్థితి నెలకొంది. మండల పరిషత్ ఆవరణలో ప్రభుత్వ, అక్కడి ఉద్యోగుల వాహనాల పార్కింగ్‌కు షెడ్ నిర్మిస్తే దాన్ని ప్రైవేటు వాహనాలు ఆక్రమించుకున్నా సంబంధిత మండల పరిషత్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. మండల పరిషత్ ఆవరణలో ప్రభుత్వ వాహనాల పార్కింగ్‌కు నాలుగేళ్ల క్రితమే షెడ్ నిర్మించుకోగా, అప్పట్లోనే ప్రైవేటు వాహనదారులు ఆక్రమించేసుకుని, దర్జాగా తమ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో కార్యాలయ సిబ్బందితోపాటు ప్రభుత్వ వాహనాలు సైతం ఆరు బయట పార్కింగ్ చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది, పశు వైద్య అంబులెన్స్ , అధికారుల వాహనాల పార్కింగ్ చేసుకునేందుకు అవకాశం లేకుండా రివైటు వాహనాలు ఆక్రమించుకున్న తీరుపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఆరుబయటే పార్కిగ్ చేసిన అంబులెన్స్

బుచ్చింపేటకు నాలుగు బోర్లు మంజూరు

ప్రజాశక్తి-రోలుగుంట : చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తన నిధుల నుంచి బుచ్చింపేట గ్రామానికి నాలుగు చేతి పంపులు మంజూరు చేశారు.

గత వారం బుచ్చింపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మశ్రీ దృష్టికి స్థానికులు తాగునీటి సమస్యను తీసుకురాగా, వెంటనే స్పందించి నాలుగు బోర్లు మంజూరు చేశారని సర్పంచ్ ఉలబాల చంద్ర, ఎంపిటిసి సత్యవతి, రైతులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

మహా శివరాత్రి జాతరకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

- ఏర్పాట్లలో నిమగ్నమైన యంత్రాంగం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మహా శివరాత్రి సందర్భంగా ఈనెల 18,19 తేదీల్లో జరగబోవు కల్యాణపులోవ ధారమట్టం జాతర్ల సందర్భంగా వివిధ గ్రామాలకు ఎటువంటి అదనపు ఛార్జీలు లేకుండా సాధారణ ఛార్జీలతో నర్సీపట్నం ఆర్‌టిసి డిపో నుండి 50 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ధీరజ్ తెలిపారు.

జాతరకు వెళ్లే భక్తులకు ఇబ్బందులు లేకుండా బస్‌ల కండిషన్‌ను చెక్ చేసి సరిచేసి ప్రయాణికులు, భక్తులకు అసౌకర్యం కలగకుండా సురక్షితంగా గమ్యస్థానాలకు, చేరవేసేందుకు వీలుగా బస్సుల సామర్థ్యం పరిశీలనకు విశాఖపట్నం జిల్లా డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజనీర్ బి. అప్పలనాయుడు వచ్చారు. అన్ని బస్సులను క్షుణ్ణంగా పరిశీలించి లోపాలను సరిచేయుటకు అధికారులకు, గ్యారేజ్ సిబ్బందికి తగు సూచనలు చేశారన్నారు. బస్సులకు అవసరమయ్యే స్పేర్ పార్ట్స్ ముందుగా సిద్ధం చేసుకోమని సంబంధిత అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో మెకానిక్ ఫోర్‌మేన్ ఆచారి సిబ్బంది పాల్గొన్నారు.